వాయిస్ ఆఫ్ ప్రజలు

# వాయిస్ టుడే

TGTEL/25/A2649

VOICE OF PRAJALU

తెలుగు దినపత్రిక

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10


సోమవారం, మార్చి 2, 2026

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ



దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం

- అమెరికా, ఇస్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి
- ఒకేసారి 48 మంది ఇరాన్ అగ్రనేతలను అంతం చేశామన్న ట్రంప్
- ఇస్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి దాడుల పరంపర
- భారత్ నుంచి వెళ్లే 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు రద్దు

2లో




## న్యాయవాదులు సరిగ్గా ఆలోచిస్తేనే.. ప్రజలకు సరైన న్యాయ జరుగుతుంది!

- తిరుపతిలో కోర్టు భవనాల సముదాయానికి శంకుస్థాపన శుభసూచికం
- నూతనంగా వచ్చే న్యాయవాదులు మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారు
- న్యాయవాదులు సరిగ్గా ఆలోచిస్తేనే ప్రజలకు సరైన న్యాయ జరుగుతుంది

# మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు...

## తెలుగువారికి సీఎం రేవంత్ రెడ్డి సూచన

- గల్ఫ్ దేశాల్లోని తెలుగువారు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ సూచన
- ఎంబసీల మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు పాటించాలని పిలుపు
- బహ్రెయిన్‌లోని తెలుగువారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఏపీ స్పీకర్ అయ్యన్న
- అవసరమైతే కేంద్రంతో మాట్లాడి క్షేమంగా రప్పిస్తామని హామీ



గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ నివసిస్తున్న తెలుగు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధ మేఘాలు అలుముకుంటున్న వేళ.. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఇరాన్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లోని పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అక్కడి తెలుగువారు భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే హెచ్చరికలు, భద్రతా సూచనలను తప్పకుండా పాటించాలని కోరారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని పౌరులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు రాష్ట్ర యంత్రాంగం

2లో




# దేశానికే ఆదర్శంగా అమరావతి జస్టిస్ సిటీ

## విజయవాడలో మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరైన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- జస్టిస్ సిటీలో అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తామన్న సీఎం
- న్యాయ వ్యవస్థకు అవసరమైన భూములు ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటన
- అమరావతిని బ్లూ గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడి

అమరావతిలో నిర్మిస్తున్న జస్టిస్ సిటీని దేశంలోనే అత్యుత్తమ మోడల్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడ వేదికగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ అథార్టీ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం'పై జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో న్యాయ వ్యవస్థ బలోపేతానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. రాజధాని నిర్మాణంలో భాగంగా జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా జుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథార్టీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా

- మిగతా 2వ పేజీలో



## డీసీసీల అధ్యక్షులకు నేడు రాహుల్ క్లాస్

- సంస్థాగత నిర్మాణం, పార్టీ ఆలోచనల గురించి దిశానిర్దేశం
- మాటామంతితో పాటు ఫొటో సెషన్లలో పాల్గొననున్న కాంగ్రెస్ అగ్రనేత
- నేడు అనంతగిరిలో తెలంగాణ, ఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు
- హాజరుకానున్న రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు

2లో

# గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతపై ప్రధానంగా చర్చ

- ఢిల్లీకి రాగానే అత్యవసరంగా సమావేశం కానున్న ప్రధాని మోదీ
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సీసీఎస్ భేటీ
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి వార్తలతో పెరిగిన ఆందోళన
- రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక మంత్రులతో కీలక సమీక్ష

## అవి డీప్‌ఫేక్ వీడియోలు... ఇది వైసీపీ వాళ్ల పనే!

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫైర్
- సోషల్ మీడియాలో తనపై డీప్‌ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని వెల్లడి
- టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- దీని వెనుక వైసీపీ నేతలు ఉన్నారని ఆగ్రహం
- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడి



# మానవ తప్పిదం వల్లే వేటపాలెం బ్లాస్టింగ్..!

- 21 మంది మృతి.. వేటపాలెం ఫైర్ వర్క్స్‌లో భీకర విస్ఫోటం
- ఫారెన్సిక్ రిపోర్ట్ సంకేతాలు.. సల్ఫర్ ఒరిపిడి లేదా స్పార్క్ కారణమా?
- భద్రతా నిబంధనల ఉల్లంఘన.. ఒక్క షెడ్డులో 20 మందికి పైగా కార్మికులు
- ప్రభుత్వ చర్యలు వేగం.. యజమాని కుటుంబంపై కేసులు నమోదు

# ఖమేనీ ఖతం

- హైదరాబాదులో నల్ల దుస్తులు ధరించి రోడ్డెక్కిన షియా ముస్లింలు
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యపై హైదరాబాద్‌లో నిరసనలు
- అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ భారీ ర్యాలీ
- ఖమేనీ మృతికి సంతాపంగా ఇరాన్ కాన్సులేట్ వద్ద జెండా అవనతం



అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంపై హైదరాబాద్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆదివారం పాతబస్తీలోని షియా ముస్లింలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. ఖమేనీ మరణవార్త ధృవీకరణ కావడంతో పాతబస్తీలోని షియా ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పురానీ హవేలీ, నూర్ ఖాన్ బజార్, దారుల్షా తదితర ప్రాంతాల్లో నల్ల దుస్తులు ధరించి, చేతిలో ఖమేనీ ఫొటోలు పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు.

- మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగొంతుక - మనస్నేహం
సోమవారం, మార్చి 2, 2026

# గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతపై ప్రధానంగా చర్చ

(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజుల రాష్ట్రాల పర్యటన ముగించుకుని ఢిల్లీకి రాగానే ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో.. దేశ అత్యున్నత నిర్ణయాక వ్యవస్థ అయిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్)తో ఆయన భేటీ కానున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా వైమానిక దాడులు చేయడం, ఇదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఈ పరిణామాల దృష్ట్యా భారత్ అప్రమత్తమైంది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరి పర్యటనలు ముగించుకుని రాత్రి 9:30 గంటల సమయంలో ప్రధాని ఢిల్లీ చేరుకుంటారు. వచ్చిన వెంటనే రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక శాఖ మంత్రులతో కూడిన సీసీఎస్ బృందంతో సమావేశమవుతారు. ఈ అత్యవసర భేటీలో ప్రధానంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, భారత్‌పై వాటి ప్రభావం గురించి చర్చించనున్నారు. ముఖ్యంగా యూఏఈ, ఇతర గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రత, ఇంధన భద్రత (చమురు ధరలు), సముద్ర వాణిజ్య మార్గాల రక్షణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అవసరమైతే భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు (ఎవాక్యుయేషన్) తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపైనా చర్చ జరగనుంది. అంతర్జాతీయంగా పరిస్థితులు వేగంగా మారుతున్న వేళ.. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునేందుకు మోదీ సర్కార్ ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.

# మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు...

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు అక్కడి ఎంబసీలతో టచ్‌లో ఉండాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బహ్రెయిన్‌లోని తెలుగువారి భద్రతపై ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరా తీశారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రెయిన్‌లో ఆందోళన నెలకొంది. అక్కడ సుమారు 50 వేల మంది ఏపీ వాసులు ఉపాధి పొందుతుండగా, వారిలో అయ్యన్న సొంత నియోజకవర్గమైన నర్సీపట్నం వారే అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో అక్కడి తెలుగువారితో ఫోన్‌లో మాట్లాడిన స్పీకర్.. ధైర్యంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ ద్వారా సాయం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అయ్యన్న తెలిపారు. పరిస్థితి విషమిస్తే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో మాట్లాడి.. తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

# అవి డీప్‌ఫేక్ వీడియోలు... ఇది వైసీపీ వాళ్ల పనే!

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియాలో తనపై డీప్‌ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని వెల్లడి టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ఆరోపణ దీని వెనుక వైసీపీ నేతలు ఉన్నారని ఆగ్రహం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. కొందరు తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు నకిలీ డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి వ్యాప్తి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించి తన రూపాన్ని అనుకరిస్తూ వీడియోలు తయారు చేసి, తనను వ్యక్తిగతంగా అప్రతిష్ట పాలుచేసేందుకు కుట్ర పన్నుతున్నారని తెలిపారు. ఈ మేరకు బీఆర్ నాయుడు సోషల్ మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ కంటెంట్ మొత్తం అసత్యమైనది, వక్రీకరించినది. టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు పన్నిన పథకం ఇది. దీని వెనుక రాజకీయ దురుద్దేశం ఉంది. వైసీపీకి చెందిన కొందరు ఈ తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై చట్ట ప్రకారం ముందుకెళతానని స్పష్టం చేశారు. ఈ దుష్ప్రచారం వెనుక ఉన్న కుట్రను తేల్చాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వ్యక్తులను, దుష్ట శక్తులను వదిలే ప్రసక్తే లేదని బీఆర్ నాయుడు హెచ్చరించారు. దోషులు ఎవరైనా కఠిన చర్యలు తప్పవని ఆయన తేల్చి చెప్పారు. కాగా, వైసీపీ తన సోషల్ మీడియా ఖాతాలో ఇవాళ కొన్ని వీడియోలను పంచుకుంది. ఈ వీడియోలపైనే బీఆర్ నాయుడు తీవ్రంగా స్పందించారు.

# ఖమేనీ ఖతం

(మొదటి పేజీ తరువాయి)

తంజీమ్-ఎ-జాఫరీ సంస్థ పిలుపు మేరకు పురానీ హవేలీలోని మజార్-ఎ-ఇబ్నే-ఖతూన్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పలువురు కంటతడి పెడుతూ నినాదాలు చేశారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడినందుకే ఖమేనీని పొట్టనబెట్టుకున్నారని, అగ్రరాజ్యాలకు తలొగ్గని నేతగా ఆయన నిలిచారని షియా మత పెద్దలు కొనియాడారు. ముస్లింల మధ్య ఐక్యత లేకపోవడమే ఈ విషాదానికి దారితీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఖమేనీ మృతికి సంతాప సూచకంగా హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం వద్ద ఆ దేశ జాతీయ జెండాను అవనతం చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పాతబస్తీలో ముందు జాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, శనివారం ఉదయం టెహ్రాన్‌లో తన నివాసంలోని కార్యాలయంలో ఉండగా అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మృతి చెందారని ఇరాన్ మీడియా వెల్లడించింది.

# దేశానికే ఆదర్శంగా అమరావతి జస్టిస్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

యూనివర్సిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి కీలక విభాగాలన్నింటినీ ఒకే చోట ఇంటిగ్రేట్ చేస్తూ.. బెస్ట్ జుడిషయల్ సిటీని నిర్మిస్తామని తెలిపారు. ఈ బృహత్తర కార్యానికి సీజేఐ సహకారం కావాలని ఆయన కోరారు. అమరావతిలో 'నేషనల్ జుడిషియల్ అకాడమీ' ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన భూములు ఇవ్వడానికి, పూర్తి సహకారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీజేఐకి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకునే సంప్రదాయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. తన తండ్రి కూడా గ్రామంలో పెద్దరికం వహించి, మధ్యవర్తిత్వం ద్వారా ఎన్నో సమస్యలను పరిష్కరించారని తెలిపారు. కోర్టుల్లో కేసుల భారాన్ని తగ్గించేందుకు మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరిస్తే రూ. 10 వేలు, ఒకవేళ కేసులు పరిష్కారం కాకపోయినా రూ. 3 వేలు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించారు. సత్వర న్యాయం అందడం వల్ల అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ప్రజల అవసరాలకు అనుగుణంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్ విధానంలో 29,000 మందికి పైగా రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చారని, వారి త్యాగంతోనే ఈ నిర్మాణం సాధ్యమవుతోందన్నారు. పర్యావరణ హితంగా, ఆర్థికంగా బలమైన రాజధానిగా ఉండాలనే లక్ష్యంతో.. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన బ్లూ-గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. అంతకుముందు సదస్సుకు విచ్చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కు సీఎం చంద్రబాబు, ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



# ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం



"ఒక్క దెబ్బకు 48 మంది ఇరాన్ అగ్రనేతలను లేపేశాం.. ఇది మాకు అద్భుత విజయం" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. మార్చి 1 నాటికి పరిస్థితి చేజారిపోయి, పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ఇరాన్ గుండెల్లో గుబులు రేపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద విషాదంగా మారింది. టెహ్రాన్ నడిబొడ్డున అమెరికా, ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. దాదాపు 1,200కు పైగా బాంబులు, ఆయుధ సామగ్రితో ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ విధ్వంసంలో ఇరాన్ అగ్రనాయకత్వం కుప్పకూలింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ దాడి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఇరాన్ ఒకవేళ ప్రతీకారానికి దిగితే, ఇంతకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఇది తమ ఉనికి కోసం జరుగుతున్న యుద్ధమని, దాడులను మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, తమ నాయకుడి మరణంతో రగిలిపోతున్న ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌లోని బీట్ షెమెష్‌పై బాలిస్టిక్ మిస్సైల్స్‌తో దాడి చేయడంతో 8 మంది మరణించారు. అటు గల్ఫ్ జలాల్లోని ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఓ ట్యాంకర్ పూర్తిగా మునిగిపోగా, మరొకటి ధ్వంసమైంది. ఈ ఘటనలో భారతీయులు కూడా గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు, ఇరాన్ తన క్షిపణులతో అమెరికా యుద్ధ నౌక 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్'పై దాడి చేశామని ప్రకటించుకుంది. అయితే అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ వార్తలను ఖండించింది. ఇరాన్ క్షిపణులు తమ దరిదాపుల్లోకి కూడా రాలేదని కొట్టిపారేసింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్‌లో తాత్కాలిక పాలక మండలి ఏర్పాటైంది. అయతోల్లా అలిరెజా అరాఫీని తాత్కాలిక సుప్రీం లీడర్‌గా నియమించారు. ఈ యుద్ధ ప్రభావం సామాన్యులపైనా తీవ్రంగా పడుతోంది. పాకిస్థాన్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద జరిగిన నిరసనల్లో 9 మంది మరణించారు. యుద్ధం కారణంగా గగనతలం మూసివేయడంతో విమానయాన రంగం కుదేలయ్యింది. భారత్ నుంచి వెళ్లాల్సిన 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 100కు పైగా సర్వీసులు రద్దయ్యాయి. రష్యా, చైనా ఈ దాడులను ఖండించగా... పరిస్థితి ఇంకా ఏ మలుపు తిరుగుతుందోనని ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

# డీసీసీల అధ్యక్షులకు నేడు రాహుల్ క్లాస్



హైదరాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సోమవారం రాష్ట్రానికి రానున్నారు. గత పది రోజులుగా వికారాబాద్ జిల్లా అనంతగిరిలోని హరిత రిసార్ట్స్‌లో జరుగుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరు కానున్నారు. శిక్షణ తీసుకున్న డీసీసీ అధ్యక్షులకు పార్టీ సంస్థాగత నిర్మాణం, వారి విధులు, పార్టీ ఆలోచనల గురించి దిశానిర్దేశం చేయనున్నారు. అక్కడే రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులను కలవనున్న రాహుల్ వారితో ఫొటో సెషన్‌లో పాల్గొననున్నారు. కాగా డీసీసీ అధ్యక్షుల కుటుంబ సభ్యులను కూడా ఈ శిబిరానికి ఆహ్వానించారు. వారితో కూడా మాట్లాడనున్న రాహుల్ ఫొటోలు సైతం దిగనున్నారు. వసీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు పీఏసీ సభ్యులు, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, సంగతన్ సృజన్ అభియాన్ జాతీయ ఇన్‌చార్జి చల్లా వంశీచందర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు సంపత్‌కుమార్, విశ్వనాథన్, సచిన్ సావంత్, టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఏపీ నుంచి 41 మంది, తెలంగాణ నుంచి 36 మొత్తంగా 77 మంది డీసీసీ అధ్యక్షులు శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు.

పీసీసీ వర్గాలు వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 7:10 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరనున్న రాహుల్‌గాంధీ 9:20 నిమిషాలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, మంత్రులు, పార్టీ నేతలు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఉదయం 9:40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరనున్న రాహుల్‌గాంధీ 10 గంటలరే వికారాబాద్‌కు వచ్చి అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హరిత రిసార్ట్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4:30 గంటల వరకు శిక్షణ శిబిరంలో ఉంటారు. తిరిగి హెలికాప్టర్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని 5:30 గంటలకు ఢిల్లీ వెళ్తారు.

# మానవ తప్పిదం వల్లే వేటపాలెం బ్లాస్టింగ్..!

కాకినాడ జిల్లా వేటపాలెం శివార్లలోని 'సూర్యశ్రీ ఫైర్ వర్క్స్' కేంద్రంలో శనివారం మధ్యాహ్నం సంభవించిన భీకర విస్ఫోటం పెను విషాదాన్ని మిగిల్చింది. పచ్చని పొలాల మధ్య బాణసంచా తయారీలో నిమగ్నమైన కార్మికులపై మృత్యువు ఒక్కసారిగా విరుచుకుపడింది. ఈ ప్రమాదంలో 21 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురి పరిస్థితి ఇప్పటికీ విషమంగానే ఉంది. ఈ ఘోర ప్రమాదం కేవలం ఒక యాదృచ్ఛిక ఘటన కాదని, పూర్తిగా మానవ తప్పిదం , భద్రతా నియమాల ఉల్లంఘన వల్ల జరిగిన ఘోరమని అధికారిక వర్గాలు ప్రాథమికంగా నిర్ధారించాయి. మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో, భోజన సమయం కావడంతో కొంతమంది కార్మికులు బయటకు వెళ్లిన తరుణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యూనిట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భారీ స్థాయిలో నిల్వ ఉన్న బాణసంచా బాంబుల్లా పేలిపోయాయి. ఈ విస్ఫోటం ఎంత తీవ్రంగా ఉందంటే, దాని శబ్దం సుమారు ఐదు కిలోమీటర్ల మేర వినిపించడమే కాకుండా, సమీప గ్రామాల్లోని ఇళ్లపై కూడా ప్రభావం చూపింది. మృతదేహాలు తునాతునకలై 50 మీటర్ల దూరం వరకు గాలిలో ఎగిరి పొలాల్లో పడిపోయాయంటే పేలుడు తీవ్రత ఎంత భీకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు 14 గంటల తర్వాత కూడా సంఘటనా స్థలంలో ఇంకా పొగలు వస్తూనే ఉన్నాయంటే నిల్వ ఉన్న మందుగుండు సామగ్రి ఎంత భారీగా ఉందో స్పష్టమవుతోంది. ఫారెన్సిక్ నిపుణుల పరిశీలన ప్రకారం, ఈ విస్ఫోటానికి రెండు ప్రధాన కారణాలు ఉండవచ్చని తెలుస్తోంది. బాణసంచా తయారీలో కీలకమైన సల్ఫర్‌ను గొట్టాల్లో నింపి దట్టించే సమయంలో ఏదైనా చిన్నపాటి ఒరిపిడి జరిగి ఉండవచ్చు లేదా గాలిలో తేమ శాతం , రసాయనాల కలయికలో తేడా రావడం వల్ల ప్రమాదం సంభవించి ఉండవచ్చు. మరో ప్రధాన వెర్షన్ ప్రకారం, బాంబులకు ఉండే వత్తులను కట్ చేసే కటింగ్ మిషన్ వద్ద కార్మికులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వచ్చిన ఒక చిన్న నిప్పురవ్వ (రాజుఖుతీని), పక్కనే ఉన్న భారీ నిల్వలకు అంటుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ రెండు సందర్భాల్లోనూ మానవ తప్పిదమే ప్రధాన పాత్ర పోషించిందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిజానికి ఈ పరిశ్రమకు 2027 వరకు అనుమతులు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భద్రతా ప్రమాణాలను యజమాన్యం పూర్తిగా విస్మరించింది. నిబంధనల ప్రకారం ఒక షెడ్డులో కేవలం ఎనిమిది మంది మాత్రమే ఉండాల్సి ఉండగా, జాతరల కోసం వచ్చిన భారీ ఆర్డర్లను పూర్తి చేసే తొందరలో ఏకంగా 20 మందికి పైగా కార్మికులను ఒకే చోట కూర్చోబెట్టి పనులు చేయించారు. దీనివల్ల ప్రమాదం జరిగినప్పుడు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది.

# న్యాయవాదులు సరిగ్గా ఆలోచిస్తేనే.. ప్రజలకు సరైన న్యాయ జరుగుతుంది!

తిరుపతి రూరల్ మండలం దామినేడు వద్ద నిర్మించనున్న 16 కోర్టు భవనాల సముదాయానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు అండ్ న్యాయవాదులు సహా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. తిరుపతిలో కోర్టు భవనాల సముదాయ నిర్మాణం శుభసూచికమని తెలిపారు. కొత్త కోర్టులు నిర్మించబడటం ద్వారా న్యాయవ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రజలకు వేగంగా న్యాయం అందించే అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. 'తిరుపతిలో కోర్టు భవనాల సముదాయానికి శంకుస్థాపన శుభసూచికం. న్యాయ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. నూతనంగా వచ్చే న్యాయవాదులు మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు తమకు న్యాయం జరగాలని కోర్టు మెట్లు ఎక్కుతారు. న్యాయవాదులు సరిగ్గా ఆలోచిస్తేనే వారికి సరైన న్యాయ జరుగుతుంది. అనారోగ్య సమస్య రాగానే నయమవుతుందన్న నమ్మకంతో ఆసుపత్రికి వెళుతారు. వైద్యులు ఇచ్చిన భరోసాతో తమకు బాగా అవుతుందని నమ్ముతారు. అలానే కోర్టుకు వచ్చామంటే తమకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని నమ్మకంతో రావాలి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

# మఠాలు, పీఠాలపై దాడులు సహించం

**వీహెచ్ పీ ధర్మాచార్య ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి**

**ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడితే హిందూ సమాజం తిరగబడుతుందని హెచ్చరిక**

**మఠంపై దాడులకు దిగడం హిందూ భక్తుల విశ్వాసాలను గాయపరచడమే..!**

**స్వామీజీలను అవమానించేలా చర్యలు చేపట్టడం తీవ్ర అభ్యంతరకరమని ఆక్షేపణ**

**పీఠం భూముల పరిరక్షణకు ప్రత్యేక జీవోను విడుదల చేయాలని డిమాండ్**



హైదరాబాద్, మార్చి 01: రాష్ట్రంలోని మఠాలు, పీఠాలపై దాడులు సహించబోమని విశ్వహిందూ పరిషత్ ధర్మాచార్య ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి హెచ్చరించారు. భాగ్యనగర్ శివారు ప్రాంతమైన కోకాపేట శారద పీఠం భూములపై ప్రభుత్వ చర్య తీవ్ర నేరమన్నారు. ఆదివారం మధ్యాహ్నం శారద పీఠాన్ని విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ బృందాలు పరిశీలించాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి స్వాత్మానంద స్వామి గారితో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం దాడికి పాల్పడిన తీరును విశ్వహిందూ పరిషత్ నాయకులకు స్వామీజీ వివరించారు. ఈ సందర్భంగా పగుడాకుల బాలస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మఠాలు, పీఠాలు, మందిరాలపై దాడులు చేస్తే సహించబోమని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు వత్తాసు పలుకుతూ హిందూ మందిరాలపై దాడులకు పాల్పడితే బుద్ధి చెబుతామన్నారు. శారద పీఠంపై రాష్ట్ర ప్రభుత్వం పన్నిన కుట్ర హిందువుల విశ్వాసాలను గాయపరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలాన్ని లాక్కోవడానికి ప్రయత్నించిన ప్రభుత్వం వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారుల తప్పుడు నివేదికల ఆధారంగా హిందువుల విశ్వాసాల పై దాడికి పాల్పడితే రాజ్యాంగం హర్షించదన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు మద్దతుగా హిందూ స్వామీజీలను హింసిస్తే హిందూ సమాజం తిరగబడుతుందని బాలస్వామి హెచ్చరించారు. శారదా పీఠం స్థలాన్ని లాక్కోవాలని జారీ చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకొని, పీఠం భూములను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఈ పీఠం భూములపై ఏకపక్ష చర్యలు తీసుకోవడం అనేది హిందూ ధార్మిక భావోద్వేగాలను దెబ్బతీయడమేనని ఆయన విమర్శించారు. శారద పీఠం కేవలం భూమి కాదని ,అది భక్తుల విశ్వాసానికి నిలయం అన్నారు. వేదాధ్యయనానికి కేంద్రంగా, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తున్న పీఠాలపై పగబట్టి కూల్చివేయడం హిందూ వ్యతిరేక చర్య అని అన్నారు. ధార్మిక సంస్థల భూముల విషయంలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలన్నారు. స్వామీజీలతో, పీఠాధిపతులతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం హిందూ సమాజం క్షమించదని పేర్కొన్నారు. సనాతన సంప్రదాయాల పరిరక్షణలో స్వామీజీల పాత్ర అపారమైనదని, వారిని అవమానించేలా లేదా వారి సంస్థల స్వయం ప్రతిపత్తిని హరించేలా చర్యలు తీసుకుంటే విశ్వహిందూ పరిషత్ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అనంతరం రాజ్యశ్యామల మాతను దర్శించుకుని పీఠం పరిసర ప్రాంతాలను, భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రామారావు, రంగనాథ్, అంకిత్, మహేష్, శంకర్ తోపాటు విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



## వద్దిరాజు రవిచంద్ర శారదా పీఠం సందర్శన

**రాజశ్యామల అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ**

హైదరాబాద్, (వాయిస్ టుడే) : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కోకాపేట నియోపోలిస్‌లో నెలకొన్న శారదా పీఠం ను సందర్శించారు. ఎంపీ రవిచంద్ర తన సన్నిహితుడు మరికల్ పోత సుధీర్ కుమార్‌తో కలిసి ఆదివారం సాయంత్రం పీఠాన్ని సందర్శించి, రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఎంపీ రవిచంద్ర, సుధీర్ కుమార్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. అలాగే అమ్మవారి చిత్రపటాలను బహుకరించారు. ఈ సందర్శనలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.






## పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత

**మన ఊరి న్యూస్ సీఈవో మసున లక్ష్మణ్ కుమార్**

హైదరాబాద్, మార్చి 01: పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని మన ఊరి న్యూస్ సీఈవో మసున లక్ష్మణ్ కుమార్ అన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం జల్ పల్లి డివిజన్, శ్రీరామ కాలనీలో విద్యార్థులు, స్థానిక ప్రజలతో కలిసి పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఇంట్లోని చెత్తను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ మునిసిపల్ సిబ్బందికి మాత్రమే చెత్తను అందజేసి రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. రోడ్లపై చెత్త వేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు ప్రజలు వివిధ రోగాల బారిన పడుతూ.. అనారోగ్యానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఒకరిద్దరు చేసే తప్పిదాల వల్ల ప్రజలందరూ ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది.. అందువల్ల ప్రజలు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భవిష్య స్కూల్, కోటి విద్యాలయం స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవి విరమణ, ఉద్యోగానికి కానీ జీవితానికి కాదు




హైదరాబాద్, మార్చి 01: ప్రతి ఉద్యోగికి, పదవి విరమణ అనేది ఉద్యోగానికే కానీ జీవితానికి కాదని, మిగిలిన శేష జీవితాన్ని, కుటుంబ సభ్యులకు, కేటాయించాలని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బ్రదర్ జాన్ కలరేకల్ పేర్కొన్నారు, ఈ మేరకు ఆబిడ్స్ లోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో మూడు దశాబ్దాలుగా విద్యార్థులకు సేవలు అందించిన ఉపాధ్యాయులు సంపత్ కుమార్, ఏ నీరజ, సబీనా, కేజీయ విజయ్ కుమార్ లకు పదవి విరమణ వీడ్కోలు సభ నిర్వహించారు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రదర్ జాన్ కలరేకల్ మాట్లాడుతూ.. లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో మూడు దశాబ్దాలకు పైగా విద్యార్థులుకు సేవలందించి వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా, తీర్చిదిద్దేందుకు కృషి చేయడం గొప్ప విషయం అన్నారు. ఇంతటి సేవలు అందించి, పదవి విరమణ పొందడం కొంతమేరకు బాధ కలిగిందన్నారు. తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో ఉన్నత హోదాలో కొనసాగడం గొప్ప విషయం అన్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దడం లిటిల్ ఫ్లవర్ పాఠశాల గొప్పతనం అని ఆయన కొనియాడారు. అనంతరం పదవి విరమణ పొందిన నలుగురు ఉపాధ్యాయులను లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోనీపి, వైస్ ప్రిన్సిపల్ అపోలీ డిసోజా, కరస్పాండెంట్ బ్రదర్ జై కబ్ మతాలి కునాల్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అజిత్, రమేష్, శ్రీధర్, దీప్తి దేశ్వాల్, అభిలాష్, నీతో పాటు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ అరాచకాలు

**బాధితులతో కలిసి రాజేంద్రనగర్‌లో పాదయాత్ర చేసిన కేటీఆర్**



కుత్బుల్లాపూర్ మార్చ్ 1(వాయిస్ టుడే): మూసీ సుందరీకరణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలకు బాధితులైన కుటుంబాలతో కలిసి, రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్‌షాకోట్, కేకే నగర్ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాటుగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మరియు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు.



## కరాటే పోటీల్లో మోడరన్ హై స్కూల్ విద్యార్థుల అద్భుత విజయం

**గోల్డ్ మెడల్ సాధించిన మంథన్ గైక్వాడ్, హర్షవర్ధన్**

**అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండాలి**

హైదరాబాద్, మార్చి: 1: కాటేదాన్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో మోడరన్ హై స్కూల్ మంథన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు.రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోటీల్లో మంథన్ గైక్వాడ్, ఈ. హర్షవర్ధన్ అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించి బంగారు పతకాలు సాధించి ప్రథమ స్థానాలు దక్కించుకున్నారు.వారి విజయం పాఠశాలకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందని యాజమాన్యం తెలిపింది. క్రమశిక్షణతో కూడిన సాధన, కోచ్ సుధాకర్ సమర్థవంతమైన శిక్షణ ఫలితంగానే ఈ ఘన విజయం సాధ్యమైందన్నారు.ఈ సందర్భంగా ముత్యం రెడ్డి, సచ్‌దేవి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న విద్యార్థులనుఅభినందించి, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రాంగణంలో విజేతలకు ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు.



## రక్తదానం చేయండి, ఇతరులకి ప్రాణదాతగా ఉండండి

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ**

కుత్బుల్లాపూర్ మార్చ్ 1(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ బౌరంపేట్ 295 డివిజన్‌లో సింధు పార్సల్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో డా॥ నిఖిల్ నూతక్కి మెమోరియల్ ట్రస్ట్ వారు మరియు కిమ్స్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య మరియు రక్త దాన శిబిరం కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం అనేది ఒక కీలకమైన ప్రాణాలను కాపాడే సంఘీభావ చర్య ఇది కేవలం పది నిమిషాల్లోనే మూడు ప్రాణాలను కాపాడుతుంది. సరళమైన సురక్షితమైన మరియు ఉచిత సంజ్ఞగా, రక్తదానం అవసరంలో ఉన్న రోగులకు కీలకమైన ఆశను అందిస్తుందని ప్రమాదాలు శాస్త్ర చికిత్సలు మరియు దీర్ఘకాలిక పరిస్థితులకు స్థిరమైన సరఫరాను నిర్ధారణ చేస్తుందని అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్, తాజా మాజీ కౌన్సిలర్లు బెంబడి బుచ్చిరెడ్డి, పల్పనూరి విష్ణు వర్ధన్ రెడ్డి, నాయకులు పల్పనూరి పద్మారెడ్డి, చింతా వెంకటేష్, భూపాల్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, బాల కృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న గాంధీ సిబ్బంది

**స్పృహ తప్పిపడిపోయిన అమ్మాయి కాపాడిన రేణుక, హైమావతి**

ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన స్నికిత శ్రీ అనే యువతి, చిలకలగూడ చౌరస్తా వద్ద ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయింది. గాంధీ ఆసుపత్రిలో పని చేస్తున్న రేణుక, హైమావతిలు స్పృహ తప్పి పడిపోయిన అమ్మాయిని గమనించారు. వెంటనే అప్రమత్తమై వారి వాహనంలోనే ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో వైద్యులు వెంటనే స్పందించి చికిత్స అందించడంతో యువతి కోలుకుంది. అమ్మాయి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించి యువతిని కాపాడటంతో గాంధీ సిబ్బందికి, హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇరాన్‌పై ఇజ్రాయిల్-అమెరికా దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం: సిపిఐ తీవ్ర ఖండన



కుత్బుల్లాపూర్ మార్చ్ 1(వాయిస్ టుడే) : ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా చేపట్టిన దాడులను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండిస్తోంది. మధ్యప్రాచ్య ప్రాంతంలో శాంతి భద్రతలను భంగం కలిగించే విధంగా సామ్రాజ్యవాద శక్తులు వ్యవహరించడం ప్రపంచ శాంతికి తీవ్రమైన ముప్పుగా మారుతోంది. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్, అమెరికా దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. ఈ దాడుల వల్ల అమాయక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. సమస్యలను సైనిక దాడుల ద్వారా కాకుండా దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న అమెరికా, ఇజ్రాయిల్ చర్యలను ఐక్యరాజ్యసమితి తక్షణమే ఖండించి జోక్యం చేసుకోవాలి. భారత ప్రభుత్వం కూడా స్పష్టమైన వైఖరి తీసుకుని శాంతి పరిరక్షణకు కృషి చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తోంది.శాంతి, సౌహార్దం, ప్రజల జీవన హక్కుల కోసం పోరాడే శక్తులన్నీ ఈ దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలవాలని పిలుపునిస్తున్నాం.

## హౌస్ ఆఫ్ మెక్‌డోవెల్స్ సోడా యారీ జామ్

**హోలీ ఆన్ వీల్స్ పండగను చేస్తుంది**




నిజ జీవిత స్నేహితులు తన్మయ్ భట్, ఆదిత్య కులశ్రేష్ఠ (కుల్లూ), ఐశర్య మోహన్‌రాజ్, అనుజ్ గుప్తా కలిసి వచ్చిన ఈ విభిన్నమైన హోలీ వేడుకలో హై-పర్ఫామెన్స్ కార్లు అద్భుతమైన రంగుల కాన్వస్‌గా మారాయి.స్నేహితులతో మొదటిసారిగా పొందిన అనుభూతుల ఆనందాన్ని ఎప్పుడు మర్చిపోకుండా హౌస్ ఆఫ్ మెక్‌డోవెల్స్ సోడా యారి మాయాజాలాన్ని వేడుకగా జరుపుకుంటుంది. రోజువారీ మైలురాళ్ల నుంచి జీవితంలో ఒక్కసారి మాత్రమే జరిగే క్షణాల వరకు, ప్రతి "మొదటిది" మీ స్నేహితులతో పంచుకున్నప్పుడు ఐకానిక్‌గా మారుతుందని ఈ బ్రాండ్ విశ్వసిస్తుంది.యారి జామ్: హోలీ ఆన్ వీల్స్‌తో, హౌస్ ఆఫ్ మెక్‌డోవెల్స్ సోడా భారతదేశంలో అత్యంత ఎక్కువగా జరుపుకునే పండగలలో ఒకదానిని స్నేహపు లెన్స్ ద్వారా తిరిగి వీక్షించి గతంలో ఎన్నడూ చోటుచేసుకోని ఒక దృశ్యాన్ని సృష్టించింది.పబ్లిసిస్ గ్రూప్ ఇండియా 'టీమ్ స్పిరిట్' ద్వారా రూపొందించిన ఈ యాక్టివేషన్ గతంలో జరిగన హోలీ వేడుకలకు భిన్నంగా నిజజీవిత స్నేహితులు, హాస్యనటులు తన్మయ్ భట్, ఆదిత్య కులశ్రేష్ఠ కుల్లూతో పాటు రూపకర్తలు అనుజ్ గుప్తా, ఐశ్వర్య మోహన్‌రాజ్‌ను ఒకచోట చేర్చింది.

# కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న శివానంద్ యాదవ్

## పార్టీలోకి ఆహ్వానించిన రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, బండి రమేష్



కంటోన్మెంట్: మార్చ్ 1 (వాయిస్ టుడే ప్రతినిధి): రాబోయే హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఎన్నికలలో గెలుపు కోసం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించినట్లు వెల్లడించారు. ఓల్డ్ బోయిన్ పల్లికు చెందిన శివానంద్ యాదవ్ తన అనుచరులతో కలిసి రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, బండి రమేష్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్, బండి రమేష్ మాట్లాడుతూ .. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజలలో గొప్ప ఆదరణ సంపాదించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. రాబోయే కాలంలో కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని, హైదరాబాదు నగరంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీపిసిసి సెక్రెటరీ దండుగుల యాదగిరి మాట్లాడుతూ.... గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లోని బిఆర్ఎస్ పార్టీ నాయకుల దాడులను ఎదుర్కొని, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశామని అన్నారు. వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికలలో ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్, హస్మత్ పేట్ డివిజన్ లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామని తెలిపారు. ఓల్డ్ బోయిన్ పల్లి, హస్మంత్ పేట్ డివిజన్ లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం బండి రమేష్, మైనంపల్లి హనుమంతరావు సలహా సూచనల మేరకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు క్రమశిక్షణలతో ప్రణాళికలను ఏర్పాటు చేసి, కూకట్ పల్లి నియోజకవర్గంలోని 16 సీట్లు కైవసం చేసుకునే దశగా ముందుకు వెళ్తామని చెప్పారు. ఈ సందర్భంగా శివానంద్ యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులందరి సమిష్టి కృషితో, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ దుద్దు దేవేందర్, పంజాగుట్ట మాజీ కార్పొరేటర్ సరిత యాదవ్, ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ యాదవ్, కూకట్ పల్లి నియోజకవర్గం మైనారిటీ ఏ బ్లాక్ అధ్యక్షుడు షహీన్షా, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు రాజేందర్, అస్లం, ఎన్.ఎస్.యు.ఐ మేడ్చల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ రెడ్డి, దండుగుల సందీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## అర్జున్ హైట్స్‌కు నాలుగు సంవత్సరాలుగా తాగునీరు రావడం లేదు సార్...

## జర మా సమస్యను పరిష్కరించండని..

### ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డికి అర్జున్ హైట్స్ అసోసియేషన్ సభ్యులు వినతి

ఉప్పల్( వాయిస్ టుడే ప్రతినిధి):– ఉప్పల్ విజయపురి కాలనీ అర్జున్ హైట్స్ లో నాలుగు సంవత్సరాలుగా తాగునీటి సమస్య ఉన్నదని, మా అపార్ట్మెంట్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మందముల్ల పరమేశ్వర్ రెడ్డిని..అసోసియేషన్ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డిని అర్జున్ హైట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ట్రెజరర్, మండవ శ్రీశైలం, శ్రీధర్, సభ్యులు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మందముల్ల పరమేశ్వర్ రెడ్డి,సంబంధిత వాటర్ వర్క్స్ ఏ ఈ సత్యనారాయణ తో మాట్లాడి అర్జున్ హైట్స్ అపార్ట్మెంట్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయనకు సూచించారు. అదేవిధంగా వర్క్ ఇన్స్పెక్టర్ శేఖర్ ను విజయపురి కాలనీలోని అర్జున్ హైట్స్ వెళ్లి సంబంధిత వాటర్ సమస్య విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టాలని సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ అర్జున్ హైట్స్ లో తాగునీటి సమస్య ఉన్నదని, తాగునీరు సరిగ్గా ఆ అపార్ట్మెంట్కు రావడంలేదని, దానికి సపరేట్ లైన్ వేసే విధంగా సంబంధిత పై అధికారులకు వివరిస్తానని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీలు కాశెట్టి సుధాకర్,రమణ పూడి ఈశ్వర్, మాజీ ట్రెజర్ నవీన్,అసోసియేషన్ సభ్యులు నవీన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతి రివర్ ఫ్రంట్‌ను సందర్శించిన తెలంగాణ ప్రతినిధి బృందం



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):– గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతి రివర్ ఫ్రంట్ ను తెలంగాణ ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్శనలో పట్టణ అభివృద్ధి, పర్యాటకం, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజా సౌకర్యాల మెరుగుదలపై అమలు చేస్తున్న నమూనాలను అధ్యయనం చేశారు. తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక ఉ మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మదర్ డైయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా పర్యావరణ హిత సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ నగర అందాన్ని పెంచడంతో పాటు పర్యాటక అభివృద్ధికి దోహదపడిందన్నారు. నదీ తీర ప్రాంతాన్ని ప్రజలకు విశ్రాంతి, వినోదం, క్రీడల కోసం ఉపయోగపడేలా అభివృద్ధి చేశారు.తెలంగాణలోని మూసీ నది వంటి ప్రదేశాల్లో ఇలాంటి ప్రాజెక్టులు అమలు చేసే విధంగా అంశాలు ఉన్నట్లు తెలిపారు.



## గడపగడపకు కాంగ్రెస్ అనే నినాదంతో పాదయాత్ర

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంతోష్ యాదవ్

కంటోన్మెంట్: మార్చ 1 (వాయిస్ టుడే ప్రతినిధి): గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ భరోసా కల్పిస్తున్నట్లు, మోండా మార్కెట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంతోష్ యాదవ్ తెలిపారు. గడపగడపకు కాంగ్రెస్ పార్టీ అనే నినాదంతో తలపెట్టిన పాదయాత్రలో భాగంగా కుమ్మరి గూడ, బండిమేట్, చేపలబావి ప్రాంతాలలో ఇంటింటా తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పాదయాత్రలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. మొదటగా ముత్యాలమ్మ ఆలయం వద్ద సంతోష్ యాదవ్ దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఎమ్మెల్యే నిధుల ద్వారా ఇప్పటికే డివిజన్ లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చొరవతో అభివృద్ధి పనులు జరిగేలా చూస్తానని ప్రజలకు సంతోష్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నాగేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎస్. ఆర్. నగర్ శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం

జూబ్లీహిల్స్ 01 మార్చ్ (వాయిస్ టుడే): ఫిబ్రవరి 28న జాతీయసైన్స్ దినోత్సవం సందర్భంగా సి. వి. రామన్ ఆవిర్భవించిన "రామన్ ఎఫెక్ట్'ని సర్తుచేసుకుంటూ 'దేశ వ్యాప్తంగా విజ్ఞాన ప్రదర్శనలు మరియు సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించే వేడుకలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఎస్. ఆర్. నగర్ శ్రీ చైతన్య పాఠశాలతో కూడా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా రేణుకా పోతు (డ్రగ్స్ ఇన్స్పెక్టర్‌రి గారిని పాఠశాల యాజమాన్యం వారు వీరిని ముఖ్య అతిథిగాఆహ్వానించినారు.ఈ కార్యక్రమానికి ఎ.జి.యం. శివరామకృష్ణ, ఆర్.ఐ. "హరికృష్ణ. ప్రిన్సిపల్ లావణ్య, డినో, ఉమేష్ , ఇన్ చార్జీలు మరియు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశము శాస్త్ర అవగాహన పెంచడం, దేశాభివృద్ధితో సైన్సు పాత్రను తెలియజేయడం, విద్యార్థులల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, ప్రజల దైనందిన జీవితంతో సైన్సు ప్రభావాన్ని తెలియజేయడం ముఖ్య ఉద్దేశంగా పలువరు ప్రశంగించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి బహుమతి ప్రధానం కూడా జరిపించారు – సందర్శకులు మరియు పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## 3న స్వర్ణగిరి క్షేత్రం కవాట బంధనం...

# కేతు గ్రహస్థ సంపూర్ణ చంద్రగ్రహణం

### స్వర్ణగిరి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు శ్రావణా చార్యులు



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... (వాయిస్ టుడే ప్రతినిధి ):– తెలంగాణలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి యొక్క దివ్య క్షేత్రంలో కేతు గ్రహస్థ సంపూర్ణ చంద్ర గ్రహణాన్నీ పురస్కరించుకొని మార్చి మూడో తారీఖు నాడు ఆలయంలో స్వామివారి దర్శనాలంనింటిని భక్తులందరికీ నిలిపివేయడం జరుగుతుంది. మూడో తారీఖు సుప్రభాత సేవ స్వామివారి నిత్య కైంకర్యాలంటిని సంపూర్ణం చేసుకుని స్వామి వారి ఆలయాన్ని కవాట బంధనం చేయడం జరుగుతుంది. తదుపరి తేది 4 బుధవారం రోజున శుద్ధి పుణ్య ఆవాచన లాంటి కార్యక్రమాలు , ఆలయం ప్రాంగణం మొత్తం సంప్రోక్షణ చేసుకున్న పిదప మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుండి స్వర్ణగిరిషుని దర్శనాలు పునర్ ప్రారంభం చేయడం జరుగుతుందని స్వర్ణగిరి ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణాచార్యులు నేడు ఒక ప్రకటనలో తెలిపారు.



## నిజాంపేట్ సర్కిల్ (ఎన్టీఆర్ నగర్) స్వాగత కమాన్‌లను ప్రారంభించిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ మార్చ్ 1(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని నిజాంపేట్ సర్కిల్ (ఎన్టీఆర్ నగర్) లో గల స్వాగత్ కమాన్ లను స్థానిక ఎన్టీఆర్ నగర్ సంక్షేమ సంఘం ఆహ్వానం మేరకు స్థానిక మాజీ శాసనసభ్యులులి కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ సంక్షేమ సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమని అదే విధంగా స్థానిక ఎన్టీఆర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు దీంతో వారు ప్రభుత్వంతో మాట్లాడి తక్షణమే వారి యొక్క సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు అనంతరం ఎన్టీఆర్ సంక్షేమ సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఏనుగు శ్రీనివాసరెడ్డి, ఇంద్రజిత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రెడ్డిపల్లి సుధాకర్, నాగార్జున, మోహన్ చౌదరి ప్రవీణ్ చారి మరియు ఎన్టీఆర్ సంక్షేమ సంఘం సభ్యులు మరియు స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య సేవలతో మెగా హెల్త్ క్యాంప్

### ముఖ్య అతిథులుగా ఆర్కేపూడి గాంధీ, కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ మార్చ్ 1(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట్‌లోని సింధు పార్సెల్ సర్వీసెస్ సంస్థ సహ వ్యవస్థాపకుడు డా. నిఖిల్ నూతక్కి జయంతి సందర్భంగా,కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లిలిఆర్కేపూడి గాంధీ (శేరిలింగంపల్లి ఎమ్మెల్యే) మరియు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరయ్యారు ఈ హెల్త్ క్యాంప్‌లో స్థానిక ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు మరియు అవసరమైన ఆరోగ్య సేవలు అందించబడ్డాయి. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.



## ప్రజా పాలనలో ప్రజలకు సత్వర న్యాయం..

### మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసిఉద్దీన్

జూబ్లీహిల్స్ 01 మార్చ్ (వాయిస్ టుడే) : బోరబండలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిను మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసిఉద్దీన్ ను ధన్యవాదాలు తెలిపిన లాకౌట్ అయిన ఉద్యోగులు.1997 సంవత్సరం లో కెపిహెచ్బి లోగల ఆల్విన్ కంపెనీ (ఖబ్‌శీ) లాకౌట్ చెందడంతో, ఉద్యోగులు 2004 అప్పటి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర, మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ఆర్ గారిని కలవడం జరిగింది అయితే అప్పటి ముఖ్యమంత్రి వారికి రాజీవ్ గృహకల్ప పథకంలో ఇండ్లు కేటాయిస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది.అనంతరం ఆయన కాలం చెందడం, తదనంతరం తెలంగాణ రాష్ట్ర విభజన, గత పాలకులు 10 సంవత్సరాలలో పట్టించుకోలేదు. బోరబండ కార్పొరేటర్ & మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసిఉద్దిన్ ను చెప్పడంతో ఆయన ప్రభుత్వం లోని ఉన్నత అధికారులతో మాట్లాడి ఇందిరమ్మ ఇండ్లు మాకు కేటాయించడం కోసం సహాయం చేసినందుకు మరియు ఆ ఫైల్ ను ముందుకు తీసుకు వెళ్లడం జరుగుతుంది. కావున ఈ చిరు సత్కారం చేయడం అని తెలపడం జరిగింది..



## శ్రీ నాగదేవత విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమానికి.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్లే నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్ 01 మార్చ్ (వాయిస్ టుడే): షేక్‌పేట్‌లోని హనుమాన్ దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ నాగదేవత విగ్రహాల ప్రతిష్ట మరియు శివలింగ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ భక్తిశ్రద్ధలతోపాల్గొన్నారు.. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా, ఎమ్మెల్యే దేవాలయ అభివృద్ధి కోసం నిర్వాహకులను అభినందించారు. ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక విలువలు పరిరక్షించబడాలని, దేవాలయాలు సమాజానికి శాంతి కేంద్రాలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీనాయకులు.. ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# నేను మాట నిలబెట్టుకున్నా.. కాంగ్రెస్‌ను నిలదీయండి

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులేవి?

హామీలిచ్చి మోసం చేయడంలో కేసీఆర్ ను మించిపోయిన రేవంత్ రెడ్డి

గ్రామాలకు పైసలివ్వని కాంగ్రెస్ గాంధీ గ్రామ స్వరాజ్యం గురించి మాట్లాడం సిగ్గు చేటు

పంచాయతీ ఎన్నికలైన వెంటనే కేంద్రం గ్రామాలకు నిధులు మంజూరు చేసింది

గ్రామాల అభివృద్ధి పనులకు నయాపైసా ఇయ్యని రాష్ట్ర ప్రభుత్వం

వీళ్లా గ్రామ స్వరాజ్యం గురించి మాట్లాడేది

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

గన్నేరువరంలో ఏకగ్రీవమైన పీచుపల్లి గ్రామానికి రూ.10 లక్షల ప్రోత్సహకం అందజేసిన కేంద్ర మంత్రి



కరీంనగర్,మార్చి01(వాయిస్ టుడే):బీజేపీ బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకునే గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సహకాన్ని అందజేస్తానంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థులను సర్పంచులుగా ఎన్నుకున్న గన్నేరువరం మండలంలోని పీచుపల్లి,కోహెడ మండలంలోని విజయనగర్ కాలనీ గ్రామ పంచాయతీలకు తన ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.10 లక్షల చొప్పున ప్రోత్సహక నిధులు విడుదల చేశారు.ఆయా గ్రామ పంచాయతీలకు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ గ్రామస్థుల సమక్షంలో ఆయా నిధుల సర్క్యులర్ కాపీలను గ్రామ సర్పంచులకు అందజేశారు.ఈ సందర్భంగా విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ భవిష్యత్తులో గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తా. అభివృద్ధి చేస్తా.అయినా కొందరు బండి సంజయ్ ఏం తెచ్చారంటూ విమర్శలు చేస్తున్నారు.వాటిని నేను పట్టించుకోను.ఎందుకంటే నా లక్ష్యం గ్రామాలను అభివృద్ధి చేయడమే. ఎందుకంటే గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం.వీటితోపాటు ప్రజల కోసం అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తా అని పునరుద్ఘాటించారు.అనంతరం పీచుపల్లికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ సామ రాజిరెడ్డి, బీజేపీ స్థానిక నేతలకు తన ఎంపీ లాడ్స్ నుండి రూ.10 లక్షల ప్రోత్సాహక నిధుల సర్క్యులర్ కాపీని అందజేయడంతోపాటు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.బీజేపీ బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకునే గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సహకాన్ని అందజేస్తానని గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నేను నిలబెట్టుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేస్తానని ప్రకటించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 1203 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఒక్కో పంచాయతీకి 10 లక్షల చొప్పున మొత్తం 120 కోట్ల 30 లక్షల రూపాయలు ఇవ్వాలి.కానీ ఇంతవరకు నయాపైసా ఇయ్యలే.అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.హామీలిచ్చి మోసం చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ సర్కార్ ను మించిపోయారు. కేసీఆర్ సైతం ఆనాడు ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీకి 5 నుండి 10 లక్షలదాకా ప్రోత్సాహక నగదు అందిస్తామని హామీ ఇస్తే దాదాపు 2 వేలకుపైగటా గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమయ్యాయి.కానీ చిల్లిగవ్వ ఇయ్యలే.ఈ రెండు పార్టీలు దొందూ దొందే.ప్రోత్సాహక నిధులు ఎందుకు ఇవ్వడం లేదనే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలను కోరుతున్నా అని పిలుపునిచ్చారు. “రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి చిల్లిగవ్వ ఇవ్వడంలేదు. మాజీ సర్పంచులు చేసిన పనులకు బిల్లులివ్వాలని తిరిగి తిరిగి ఆత్మహత్యలు చేసుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలే.ఈ ప్రభుత్వం అదే బాటలో నడుస్తోంది.బీజేపీ పోరాటాలకు,మాజీ సర్పంచుల ఆందోళనలకు తలొగ్గి వాయిదాల పద్దతిలో పైసలిచ్చేందుకు ముందుకొచ్చింది. మాజీ సర్పంచుల బిల్లులు సరే,గ్రామ పంచాయతీల అభివృద్ధికి పైసలేవి? కేంద్రం ఇప్పటి వరకు పంచాయతీల అభివృద్ధి కోసం దశల వారీగా దాదాపు వెయ్యి కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది.ఆ నిధులతో అంతో ఇంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు.వీళ్లా గ్రామ స్వరాజ్యం,గాంధీ ఆశయాల గురించి మాట్లాడేది?”అని ఆ ప్రకటనలో విమర్శించారు.

## జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



సిరిసిల్ల; మార్చి 01 (వాయిస్ టుడే) శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (మార్చ్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తం గా పోలీసు యాక్ట్ అమలు లో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహిం చరదాని, నిబంధనలకు విరుద్దిదం గా డి.జే వినియోగించరాదని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవం



కోనరావుపేట, మార్చి 01 (వాయిస్ టుడే) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధి లోని కొనరావుపేట మండలం మర్తన్నపేట, మల్కాపేట గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవం లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమం లో ప్రజా ప్రతినిధులు బండ నరసయ్య, జగన్మోహన్ రెడ్డి, గొట్టే రుక్మిణి, స్థానిక గ్రామస్తులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



## నేత్ర వైద్యశాలను ప్రారంభించిన మాజీ మంత్రి గంగుల

కరీంనగర్,మార్చి01(వాయిస్ టుడే):జిల్లా కేంద్రంలోని రాజా థియేటర్ లైన్ సాయినగర్లో నూతనంగా ఏర్పాటుచేసిన డా. ఇషిక నేత్ర వైద్యశాలను కుటుంబ సమేతంగా హాజరై వైద్యశాలను మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు.



## బిందువుగా మొదలై సింధువుగా మారినట్టు ఆర్ఎస్ఎస్ ప్రస్థానం

### ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యకారిణి పాక మురళి జి

తిమ్మాపూర్,మార్చి 01(వాయిస్ టుడే):బిందువుగా మొదలై సింధువుగా మారినట్టు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రస్థానం కొనసాగించి,నేడు ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ వాద స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించిందని ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యకారిణి పాక మురళి జి తెలిపారు.ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ శాఖల సాంఘీక్ కార్యక్రమం నుస్తులాపూర్ లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ జాతీయత భావనలతో స్ఫూర్తి పొందిన డాక్టర్ కేశవ్ బలిరాం హేడ్గేవార్ కొందరు యువకులతో కలిసి 1925 విజయదశమి రోజున నాగపూర్ లో ఆర్ఎస్ఎస్ ను ప్రారంభించారన్నారు. హిందూ సమాజంలో సౌశీల్యాన్ని పెంపొందించి జాతి నిర్మాణంలో భాగస్వామ్యం చేయడం “”డాక్టర్ జి”గా ప్రసిద్ధి పొందిన హెడ్గే వార్ ఎంచుకున్న ఆశయమన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు దేశ హితం కోసమే పనిచేసిందన్నారు. స్వాతంత్రానంతరం ఆర్ఎస్ఎస్ మూడు సార్లు నిషేధానికి గురైందని, మహాత్మా గాంధీ హత్య అనంతరం, ఎమర్జెన్సీ కాలంలోబాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం నిషేధానికి గురైన సంస్థ శక్తి మంతమైందే తప్ప వెనుకంజ వేయలేదన్నారు.లక్షల శాఖలు నిర్వహిస్తూ తన భావజాలాన్ని దేశంలో మారుమూల ప్రాంతాల వరకు వ్యాపింప చేసుకుంటూ ముందు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమానికి ముందు తిమ్మాపూర్ ఖండ,ఉపఖండ స్వయం సేవకులు సాంఘీక్ కార్యక్రమంలో పాల్గొని వ్యాయామం,క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత సమరసాత సహ కార్యకారిణి పుల్లూరి రామారావు,జిల్లా సేవా ప్రముఖ్ మొగిలి సంపత్ జీ,ఖండ కార్యవాహ ఆవుల కుమార్ జి, ధరిపెల్లి నరసింగరావు,కోయడ రవిచంద్ర,గగుల అజయ్,రాపర్తి శ్రీనివాస్,తిమ్మాపూర్ స్వయం సేవకులు పాల్గొన్నారు.



## ఘనంగా ఏబిసి కిడ్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

కరీంనగర్,మార్చి01(వాయిస్ టుడే):ఏబీసీ కిడ్స్ ప్లే స్కూల్ వార్షిక దినోత్సవ వేడుకలు కరీంనగర్ అల్కాపూర్ లోని శ్రద్ధ ఇన్ బాంకెట్ హాల్లో ఘనంగా జరిగాయి. చిన్నారుల ఆటపాటలతో, సాంస్కృతిక ప్రదర్శనలు,కరాటే ప్రదర్శనలు,స్కిట్లు,ఫ్యాన్సీ డ్రెస్ వాకింగ్ వినోదాత్మక ప్రదర్శనలతో సహా వివిధ రకాల రంగురంగుల కళ సాంస్కృతిక కార్యక్రమాలతో వార్షికోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగాయి.వేద పండితులు చిన్న జీయర్ స్వామి శిష్యులతో,విశిష్ట అతిథుల సాంప్రదాయ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ లు పడిశెట్టి వసంతలక్ష్మి బూమయ్య ,మాసం గణేష్ ,వెల్ది సర్పంచ్,మానకొండూర్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు పెంచాల కిషన్ రావు,డాక్టర్లు మనీష్ , ఎజ్జగిరి శ్రీనివాస్,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మధుకర్,సుమన్ టీవీ కరీంనగర్ ఎండీ సదా చారి,సామాజిక కార్యకర్త రాము డంపేటి ప్రత్యేక విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. కరస్పాండెంట్ మనోజ్ కుమార్ వేడుకలో అతిథులందరినీ ఘనంగా సన్మానించి జ్ఞాపకాలను అందజేశారు.



## మదర్ డైయిరీ అభివృద్ధికి కృషి చేయనున్న నేషనల్ డైయిరీ డెవలప్మెంట్ బోర్డు

### – ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... (వాయిస్ టుడే ప్రతినిధి):– మదర్ డైయిరీ అభివృద్ధికి నేషనల్ డైయిరీ డెవలప్మెంట్ బోర్డు కృషి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. గుజరాత్ లో నేషనల్ డైయిరీ బోర్డు ఛైర్మన్ డాక్టర్ మినేశ్ తో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక , మత్స్య శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,విజయ డైరీ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి,మదర్ డైయిరీ చైర్మన్ మధుసూదన్ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ..మదర్ డైయిరీ సంస్థ బలోపేతం ద్వారా పాల ఉత్పత్తిదారులకు మెరుగైన ధరలు, వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులు అందుబాటులోకి రావడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. డైయిరీ రంగం అభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తుందని, రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నేషనల్ డైయిరీ డెవలప్మెంట్ బోర్డు సహకారంతో మదర్ డైయిరీ విస్తరణ, సాంకేతిక ఆధునీకరణ, బలోపేతం వంటి చర్యలు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. రైతులకు శిక్షణ, పశుసంవర్ధక సేవలు, మార్కెటింగ్ సదుపాయాలు అందించడం ద్వారా పాల ఉత్పత్తి రంగంలో స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.

మదర్ డైయిరీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



## ఆరెకటికల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహాయ సహకారాలు అందజేస్తా..

### భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్

### ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్‌కి ఘనంగా సన్మానం

యాదాద్రి భువనగిరి బ్యూరో (వాయిస్ టుడే ప్రతినిధి ):– భువనగిరి పట్టణంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆరెకటిక సంఘం అధ్యక్షులు హీరే కార్ శ్రీను ఆధ్వర్యంలో భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీ వాణి రవికుమార్ కి ఘన సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరెకటిక సంఘం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మౌలిక వసతుప అభివృద్ధిపై చైర్మన్ దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేశారు. మా సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమారులు మాట్లాడుతూ ఆరెకటికల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తానని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక సంఘం నాయకులు హీరే కార్ శేఖర్ గట్కరి శ్రీకాంత్ ఇల్లు గౌలికార్ నర్సింగ్ మంతూర్ కార్ రాము జయ కృష్ణ బబ్లు రాజేశ్వర్ సాయికిరణ్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

## 8న హనుమకొండ మూకాంబిక జ్యోతిష్యాలయం లో ధన్వంతరి హోమం



హనుమకొండ,మార్చి 01 : మార్చి 8న హన్మకొండ ఇ.నెం.2-5-316, కాళోజి కాకతీయ మహిళా కాలేజి దగ్గర, నక్కలగుట్ట లో ధన్వంతరి హోమం కార్యక్రమం ఉంటుందని, అనంతరం గవ్వల ప్రశ్న ద్వారా జ్యోతిష్యం చూడబడనని ఓరుగల్లు ప్రజలు సద్వినియం చేసుకోవాలని ప్రముఖ కేరళ జ్యోతిష్యుడు, బ్రహ్మశ్రీ డా॥ కె, విష్ణు నంబూద్రి తంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జాతక పరిశీలన చేసి కేరళ గవ్వల ప్రశ్న ద్వారా గ్రహ దోశ నివారణకు శాంతి, హోమములు చేయుదును. ధన్వంతరి హోమం ఎందుకు చేయాలి? చేయడం వలన కలిగే ఫలితాలు హోమం జరుగు తేది. 08.03.2026 (ఆదివారం), ఉ॥5.00 గంటలకు స్థలం: ఇ.నెం.2-5-316, కాళోజి కాకతీయ మహిళా కాలేజి దగ్గర, నక్కలగుట్ట, హన్మకొండ. 1) హిందూ విశ్వాసాల ప్రకారం, ధన్వంతరి దీర్ఘాయువు, ఆరోగ్యానికి దేవత, భగవంతుడు దేవతలకు వైద్యుడు, ఆయుర్వేద వేదమైన ఆయుర్వేదానికి దేవుడు, కాబట్టి రోగులు, వైదులు ఇద్దరూ భగవంతుడిని పూజిస్తారు. వ్యాధికి చికిత్సతోపాటు వైద్య దేవుడైన ధన్వంతరి దేవుడిని ప్రార్థించడం మరియు ధన్వంతరి హోమం చేయడం చాలా ప్రయోజకరంగా ఉంటుందని, మన ఆరోగ్యాన్ని పునరుద్ధరించడంలో ప్రయోజకరంగా ఉంటుందన్నారు. ఇది ప్రధాన వ్యాధులు లేదా శారీరక మరియు మానసిక, అనారోగ్యాల నుండి కోలుకోవడంలో కూడా సహాయపడుతుంది. ధన్వంతరి హోమం చేయడం ద్వారా అన్ని రకాల వ్యాధులు నయమవుతాయని, ధీర్ఘాయుషు, ఆరోగ్యం లభిస్తాయన్నారు. ఆరోగ్య రుగ్మతలకు శక్తివంతమైన నివారణ, వ్యాధులు, ఇబ్బందులు, చింతలను అధిగమించడంలో సహాయపడుతుందని, ఈ హోమం శాంతి, శక్తి స్థాయిని మెరుగుస్తుంది. మన కర్మ దశలను కూడా తొలగిస్తుందన్నారు. 2) ధన్వంతరి హోమం ఔషధ మొక్కలను ఉపయోగించి నిర్వహిస్తారు. ఇది శరీరమంతా ఔషధ గుణాలను విడుదల చేస్తుంది. తద్వారా శారీరక రుగ్మతలను తగ్గిస్తుంది. ధన్వంతరి హోమం మన జాతక చక్రం నుండి మృత్యువు అనే దుష్టత్వాన్ని తొలగిస్తుంది. శ్రీ మహావిష్ణువు మోక్షమంత్రం అని కూడా పిలువబడే ధన్వంతరి మంత్రం. మరణ భయాన్ని తొలగిస్తుందని, వివిధ కారణాల వల్ల కలిగే అసహజ మరణాల నుండి మనలను రక్షిస్తుంది. ఈ హోమం చేసుకోవడం వలన మరణ భయాన్ని అధిగమించడంలో తోడ్పాడుతుంది. ఇది నవగ్రహాల దుష్ప్రభావాలను తగ్గిస్తుందన్నారు. 3 సంవత్సరాల జీవితాన్ని పొందేలా చేస్తుందన్నారు. ఈనెల 8న ఇ.నెం.2-5-316, కాళోజి కాకతీయ మహిళా కాలేజి దగ్గర, నక్కలగుట్ట, హన్మకొండ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ప్రముఖ కేరళ జ్యోతిష్యుడు, బ్రహ్మశ్రీ డాక్టర్ కె, విష్ణు నంబూద్రి తంత్రి కోరారు. మరిన్ని వివరాలకు 7382633461/9676446572 సంప్రదించాలన్నారు.

# తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రామ రాజేష్ ఖన్నా ఏకగ్రీవంగా ఎన్నిక



వరంగల్ ( వాయిస్ టుడే ) మార్చ్ 01 : తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వరంగల్ జిల్లా రామన్నపేట కి చెందిన రామ రాజేష్ ఖన్నా ను ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి యూసుఫ్ శనివారం సాయంత్రం జరిగిన రాష్ట్ర నాలుగవ మహాసభలో తెలిపారు.. శ్రీ రాముల వారి కళ్యాణ మండపంలో జరిగిన తెలంగాణ మెడికల్ కాంట్రా క్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నిక అవ్వడం జరిగింది.ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ... తనమీద నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా ఎన్నుకున్నందుకు ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ కి, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ కి ప్రత్యక్ష కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలోని వివిధ ప్రభుత్వ హాస్పిటల్ జాతీయ ఆరోగ్య మిషన్ మరియు తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు అండ్ వర్కర్స్ యూనియన్ ఉద్యోగులు సమస్యలు శాశ్వత పరిష్కారం అయ్యే అంతవరకు కృషి చేస్తానని రామ రాజేష్ ఖన్నా అన్నారు.



# భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీముల ప్రైవేటీకరణ వద్దు

తొర్రూరు, మార్చి 1 వాయిస్ టుడే : తెలంగాణలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమం కోసం ఉన్న బోర్డులోని స్కీముల పంపిణీ ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం తగదని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. తెలంగాణ ప్రగతిశీల పెయింటర్స్ యూనియన్ మండల జనరల్ బాడీ ఆదివారం తొర్రూరు లోని హైస్కూల్ ఆవరణలో బైరి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది లక్షల మంది భవన నిర్మాణ కార్మికులుగా ఉన్నారని వారికి వివిధ స్కీముల ద్వారా చేకూరి ఆర్థిక లబ్ధిని ఇవ్వటానికి ఉద్దేశించిన పథకాన్ని ప్రైవేటు వారికి ఇవ్వటం తగదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం,కార్మిక శాఖ సమన్వయంతో సెజ్ ద్వారా వచ్చిన నిధులను సక్రమంగా వినియోగిస్తూ స్కీమ్స్ సమర్థవంతంగా నడిపియవచ్చని అన్నారు. పెళ్లి లక్ష రూపాయలు డెలివరీ 50,000 మరణానికి 10 లక్షలు ఇస్తూ కార్మికులను ఆదుకోవచ్చని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కార్మిక శాఖ నిస్సహాయత కలిసి లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన పెళ్లి కానుపు మరణం పథకాలు ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చారని ఆరోపించారు. ప్రైవేట్ వ్యక్తులు ఇష్టానుసారంగా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని లబ్ధిదారులైన భవన నిర్మాణ కార్మికులకు అవి అందయని అవినీతి అక్రమాలు పెద్ద ఎత్తున జరిగే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వివిధ నిర్మాణాలకు కేటాయించిన నిధులలో సేజ్ రూపంలో కార్మిక సంక్షేమ బోర్డుకు రావలసిన మొత్తాలను వసూలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం ఉందని అన్నారు. రాష్ట్రంలో కార్మిక వర్గంపై ప్రభుత్వం కార్మిక శాఖ చూపుతున్న నిర్లక్ష్యానికి కార్మిక ఐక్య ఉద్యమం ద్వారా తగిన గుణపాఠం చెప్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఉపాధ్యక్షులు పుల్లయ్య, సెక్రటరీ వెంకటకృష్ణ, కార్యవర్గ సభ్యులు దర్గయ్య,రామ్మూర్తి, వెంకన్న,యాకయ్య,మల్లేష్,రాము,రామకృష్ణ, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# నూతన వ్యవసాయ కార్మిక చట్టాలను రద్దుచేయాలి

## వ్యవసాయ కార్మిక గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య

తొర్రూరు, మార్చి 1 వాయిస్ టుడే : నరేంద్ర మోడీ తీసుకువచ్చిన నూతన వ్యవసాయ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని కామ్రేడ్ యనమాల వెంకటయ్య నగర్ ప్రాంగణంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు మార్క సాంబయ్య, సిఐటియు నాయకులు కొమ్మనబోయిన యాకయ్య ల అధ్యక్షతన వ్యవసాయ కార్మిక గ్రామీణ పేదల సంఘం తొర్రూరు 10వ మండల మహాసభ నిర్వహించారు. ఈ మండల మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరైన సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే విబిజి రాంజీ చట్టాన్ని అమలు చేసి ఉపాధి హామీ కూలీలను నట్టేట ముంచుతున్నారని అన్నారు. అంతేకాకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులను వ్యవసాయ కూలీలను రైతులను వంచన చేస్తూ నూతన చట్టాలన్నీ అంబానీ ఆదానీలకు అనుకూలంగా అమలు చేస్తున్న ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అని వ్యవసాయ కార్మిక సంఘాలను ఐక్యం చేసి నరేంద్ర మోడీ తీసుకువచ్చిన నూతన చట్టాలను రద్దు చేసే వరకు ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక గ్రామీణ పేదల సంఘం తొర్రూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 20 మంది సభ్యులతో కూడిన మండల కమిటీని జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ ప్రకటించారు. ఈ మండల మహాసభలో వ్యవసాయ కార్మిక గ్రామీణ పేదల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గొడిశాల వెంకన్న, జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, సీఐటీయూ తొర్రూరు మండల కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్, సిఐటియు జిల్లా నాయకులు పెరుమాండ్ల బాబుగౌడ్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సారయ్య, కంటాయపాలెం ఉపసర్పంచ్ జితేందర్ రెడ్డి, భాను నిర్మాణ కార్మిక సంఘం తొర్రూరు మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు నాగన్న, ఆటో యూనియన్ నాయకులు కోటగిరి సంతోష్, నాయకులు బోర స్వామి, మార్క సోమలక్ష్మి, తిమ్మిడి రవి, వెంకటేష్, అందే మంజుల, వరలక్ష్మి, షమీనా, శ్రీలత, అమీనా, యాకలక్ష్మి, గుజ రేణుక, లక్ష్మి, భాగ్య, శారద, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రులను కలవనున్న దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి ప్రతినిధుల బృందం




వరంగల్ ( వాయిస్ టుడే ) మార్చి 01 : ఈ నెల 13, 16 తేదీలలో కేంద్ర పౌరసరఫరాలు,వినియోగదారుల శాఖ మరియు పర్యాటక ,సాంస్కృతిక వ్యవహారాల శాఖల మంత్రులను కలువనున్నదని దక్షణది రాష్టాల సమన్వయ సమితి సెంట్రల్ చీఫ్ పాట్రన్ విక్యాత్ వాసుదేవ్ ఈ మేరకు అనుమతి తీసుకున్నారు అని దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి ఇన్చార్జ్ చైర్మన్ మరియు సెక్రటరీ జనరల్ మొగిలిచెర్ల సుదర్శన్ తెలిపారు. శివనగర్ లోని సమితి కార్యాలయం లో ఆదివారం జరిగిన సమితి తెలంగాణ ప్రతినిధుల సమావేశం లో పాల్గొని అయన మాట్లాడారు. చిలువేరు ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో దిద్ది లక్ష్మీనారాయణ, కార్తీక్, శ్రవణ్, వాసుకి, నరసింహం, సూర్యం అలాగే సమితి జిల్లాల బాధ్యులు పాల్గొన్న ఈ సమావేశం కేంద్ర మంత్రులకు ,అధికారులకు అందించాల్సిన వినతులు మరియు ఫిర్యాదుల అంశాలపై పలు తీర్మానాలు చేసింది. ముఖ్యంగా వినియోగదారుల రక్షణ చట్టం 2019 అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు, తద్వారా ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో చట్టం అమలు లోపభూయిష్టంగా ఉన్నందున అంతుచిక్కని కల్తీ బారిన పడి వినియోగదారులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర నష్టానికి గురౌతున్నారు. గత దశాబ్దంగా అసలైన వస్తువనేది కనుమరుగై నూటికి నూరు శాతం కల్తీ మయమయ్యాయి. అటు ప్రభుత్వాలు ఇటు వినియోగదారుల సంఘాలు చైతన్యం కండి, అసలు వస్తువులు మాత్రమే కొనండి అని చెప్పినా, అసలైన వస్తువేది మార్కెట్లో ఉండడం లేదు. గతం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యాపారులు, అధికారులు , వినియోగదారుల ప్రతినిధులు కలిసిన సమావేశాలు మండల,జిల్లా, రాష్ట్ర మరియు కేంద్ర స్థాయిలో కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్, ప్రైస్ కమిటీ మీటింగ్స్ మరియు ఆహార సలహా సంఘాల సమావేశాలు ఉన్నతాధికారులు ,ప్రజాప్రతినిధులు మరియు మంత్రుల పర్యవేక్షణ లో జరిగి ఎప్పటికప్పుడు వినియోగదారుల సమస్యలు కల్తీ,తక్కువ తూకం, అధిక ధరలు, అధికార్ల సేవాలోపం లాంటి వాటి పరిష్కారాలు ప్రతి మూడు నెలలకొకసారి జరిగేవి. సమస్యల రేటు తక్కువగా ఉండేది. ప్రస్తుతం అలాంటి సమావేశాలు అన్ని ప్రభుత్వాలు ,అన్ని స్థాయిల్లో విధిగా జరపడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌరసరఫరాలు మరియు వినియోగదారుల మంత్రిని కోరాలని తీర్మానించింది. అలాగే అతిముఖ్యమైన పర్యాటక రంగం లో వినియోగదారులు ఎంతో ఖర్చు మరియు శ్రమకోర్చి దేవాలయాలు, వారసత్వ కట్టడాలు, పురాతన నిర్మాణాలు చూడటానికి వచ్చిన వారికి వీటి స్థానంలో " విధ్వంసాలు, ఆక్రమణ" లు మాత్రమే దర్శనమిస్తున్నాయి, వీటి రక్షణ కు ప్రత్యేక చట్టాలు, అధికార యంత్రాంగం , కోట్లాది రూపాయల ప్రజాధనవ్యయం ఉన్నా ఫలితం శూన్యం. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికే ప్రాముఖ్య మైన కాకతీయుల కోట, కట్టడాలు స్వయంగా స్థానిక ప్రభుత్వ యంత్రాంగం తీవ్ర విధ్వంసానికి గురిచేస్తున్నా, వారసత్వానికి వారసులైన వినియోగదారులు ఫిర్యాదులు చేసినా విధ్వంసాలు ఆగడం లేదు ,జీతభత్యాల ఖర్చు మిగలడం లేదు. ఈ తీవ్రమైన అంశాన్ని ఆధారాలతో కేంద్ర పర్యాటక శాఖ మంత్రికి మరియు పురావస్తు శాఖ "డైరెక్టర్ జెనరల్ " కి ఫిర్యాదుగా అందించి ,కారకులైన అధికారులు మరియు నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరడానికి తీర్మానించింది సదస్సు. తదనంతరం దక్షిణ ఏడు రాష్ట్రాల నుండి డిల్లీ కి వెళ్లాల్సిన సమితి ముఖ్యులను ఎంపికచేసింది, ఈ బృందానికి సుదర్శన్ నేతృత్వం వహిస్తారని సమావేశం నిర్ణయించింది.



# కాంగ్రేస్ పార్టీ ప్రధానకార్యదర్శి మధుకర్‌కు పితృవియోగం

## పాడె మోసి అంతిమయాత్రలో పాల్గొన్న జంగా

కాజీపేట,వాయిస్ టుడే: నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి,47వ డివిజన్ నాయకులు సత్యవరం మధుకర్ తండ్రి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి సంఘ కార్మిక నాయకుడు సత్యవరం వెంకటేశ్వర్లు గుండెపోటుతో ఆదివారం ఉదయం ఇంట్లోనే మరణించగా విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అంతిమ యాత్రలో పాల్గొని పాడే మోశారు. జంగా రాఘవరెడ్డికి ఈ కుటుంబంతో మూడు దశాబ్దాలుగా సన్నిహిత అనుబంధం ఉండటంతో హుటాహుటిన హైదరాబాద్ నుంచి వచ్చి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. "వెంకటేశ్వర్లు ఎంతో క్రమశిక్షణ గల వ్యక్తి అని,రైల్వే శాఖలో నిజాయితీగా సేవలందించారని,వారి ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని భరించే శక్తి దేవుడు కలగజేయాలని రాఘవరెడ్డి భావోద్వేగం చెందారు. కార్పొరేటర్లు సంకు నర్సింగ్,విజయ శ్రీ రజాలీ,వివిధ పార్టీల నాయకులు వెంకటేశ్వర్లు మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబాన్ని పరామర్శించారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



పాల్వంచ వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి మార్చ్ 1 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# పుస్సూర్ గ్రామ అభివృద్ధి భీమన్న ఆలయం

## ఎమ్మెల్యే రామారావు పటేల్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 01: లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ గ్రామ అభివృద్ధికి మరింత వేగం చేకూరుస్తూ భీమన్న ఆలయం నిర్మాణానికి ఈ రోజు భూమి పూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ ఆలయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ జ+ఖీ ద్వారా రూ.25 లక్షల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఆలయ నిర్మాణాన్ని అత్యుత్తమ నాణ్యతతో పూర్తి చేసి భక్తులకు ఆదర్శవంతమైన ఆలయంగా తీర్చిదిద్దాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.అదేవిధంగా గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా స్పందించిన ఎమ్మెల్యే, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేసి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు,పార్టీ నాయకులు, పాల్గొన్నారు.



# అవధూత శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన టిఆర్ఎస్ నాయకుడుగోనెల మధుకర్

## 20వేల రూపాయల ఆర్థికసహాయం అందజేత 50 కేజీల బియ్యం

వాయిస్ టుడే ప్రతినిధి మార్చ్ 1 హుస్నాబాద్ ప్రతినిధి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన అవధూత శ్రీనివాస్ కుటుంబాన్ని టిఆర్ఎస్ పార్టీ 12 వార్డు ఇంచార్జ్ గోనెల మధుకర్ వారి కుటుంబాన్ని పరామర్శించారు తన వంతు సహాయంగా వారి కుటుంబానికి 20వేల రూపాయల ఆర్థిక సహాయం 50 కేజీల బియ్యాన్ని అందించారు వారు ఇంటి పెద్దను కోల్పోవడం బాధాకరమని వారి బాధను ఎవరు తీర్చలేని ప్రమాదవశాత్తు కొన్ని జరుగుతూ ఉంటాయి అని ఆ కుటుంబా నికి అందరంఅండగా ఉండాలని తెలియజేశారు అంతేకాకుండా భవిష్యత్తులో వారి కుటుంబానికి ఈ ఆపద వచ్చిన విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

# తెలంగాణ విద్యా విధానం2026 పై సమగ్ర చర్చలు జరపాలి మరియు కొన్ని అంశాలను సవరణ చేయాలి

## యుఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్



నిర్మల్ జిల్లా ప్రతినిధి( వాయిస్ టుడే )మార్చ్ 01: బైంసా పట్టణంలో జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ మాట్లాడుతూ : తెలంగాణ రాష్ట్ర విద్యా విధానం పై ఆకునూరి మురళి చైర్మన్ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన విద్యా విధానం2026 పై సమగ్రంగా చర్చించి కొన్ని సవరణలు చేయాలని తెలంగాణ రాష్ట్రంలోని విద్యా విధానం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న అంశం సరైనదే కానీ పాఠశాల విద్య అనేక సవాళ్లు ఎదుర్కొంటుంది దానిపై ఇంకా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని అదేవిధంగా రాష్ట్రంలో ఎఫ్ సెట్ రద్దు చేయాలన్నటువంటి అంశాలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని వారు తెలిపారు. అదేవిధంగా ఎఫ్ సెట్ రద్దు వల్ల పేద విద్యార్థులు ఇంజనీరింగ్, వ్యవసాయ విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్య అంటే శ్రీ చైతన్య, నారాయణ కళాశాలలో అనేక మంది విద్యార్థులు చదువుతున్నారని ఎఫ్ సెట్ రద్దు చేయడం వల్ల కేవలం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత తో ఇంజనీరింగ్ సీట్ అంటే విద్యా వ్యాపారాన్ని పెంపొందించడానికేనని వారు తెలిపారు. ఇప్పటికే శ్రీ చైతన్య, నారాయణ ఇతర విద్యాసంస్థలు విద్యను బట్టి పట్టించి మార్కుల కోసం అనే విధంగా చదువులను కొనసాగిస్తున్నారని ఇప్పుడు ఈ విధానం అమలు అయితే విద్యార్థులకు బట్టి సిస్టం అలవాటు చేసి రేపు భవిష్యత్తులో వృత్తివిద్య కోర్సులో రాణించకుండా పోయే ప్రమాదం ఉంటుందని వారు వాపోయారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస వసతులు లేకుండా విద్య కొనసాగుతుందని దీనివల్ల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత ఏ విధంగా సాధిస్తారని ప్రశ్నించారు. అదేవిధంగా ఉన్నత విద్యలో పాలకమండలి వ్యవస్థలో ఐఏఎస్ అధికారి మరియు పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పించాలనే అంశాలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని అన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ విద్యపై కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కోర్సులలో ప్రావీణ్యం కలిగే విధంగా సిలబస్ మార్చాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. విద్యా రంగ ప్రైవేటీకరణ కు అవకాశం ఇచ్చే విద్యా కమిషన్ నివేదిక లోని అంశాలను తిరస్కరించాలని కోరారు. కమిషన్ ఇచ్చిన. సిఫార్సు లపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణమే రాష్ట్రంలో ఉన్న అన్ని విద్యార్థి సంఘాలు మరియు మేధావులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలతో చర్చలు జరపాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.





# బుద్ధవనం చేరుకున్న దమ్మ పాదయాత్ర

## ఎమ్మెల్యే జైవీర్‌తో కలిసి ఘనంగా స్వాగతం పలికిన మల్లేపల్లి లక్ష్మయ్య

నాగార్జునసాగర్, మార్చి, 1(వాయిస్ టుడే): గౌతమ బుద్ధుని శాంతి సందేశంతో ప్రజలను మేల్కొల్పుతూ సాగిన మూడవ దమ్మయాత్ర ఆదివారం సాయంత్రానికి బుద్ధవనం చేరుకుంది. దమ్మయాత్ర బుద్ధవనం చేరుకున్న సందర్భముగా స్థానిక శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మానస స్వర్ణ, వైస్ చైర్మన్ రాజా ప్రసాదులతో కలిసి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య దమ్మయాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. బంజారా నృత్యాలతో, కోలాటాలతో, ఒగ్గు కళాకారుల నృత్యాలతో, స్థానికులు, బౌద్ధ అభిమానులు అధిక సంఖ్యలో దమ్మయాత్ర బృందానికి అడుగు అడుగున పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 403 కిలోమీటర్లు పాదయాత్ర తో వచ్చిన థాయిలాండ్, భారతీయ బౌద్ధ భిక్షువులుకు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో బుద్ధవనములోని అశోక ధర్మ చక్రం వద్ద బౌద్ధ భిక్షువుల పాదాలను కడిగారు. థాయిలాండ్ నుండి బౌద్ధ దమ్మయాత్ర ద్వారా తీసుకురాబడిన బుద్ధ ధాతువులను బుద్ధ వనం ప్రధాన ద్వారం నుండి స్థానిక శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మానస స్వర్ణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షులు గగన్ మాలిక్, సిద్ధార్థ లతో కలిసి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య బుద్ధ ధాతువులను ఊరేగింపుగా తీసుకువచ్చి మహ స్తూపం లోని ధ్యాన మందిరంలో సందర్శకుల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. మహ స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిలను వెలిగించిన అనంతరం ధ్యానం చేశారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ సంఘ థాయి లాండ్ అధ్యక్షులు పర సంగ్ సక్ కోవిడో ప్రధాన బౌద్ధ భిక్కు ఆధ్వర్యంలో థాయిలాండ్ భిక్షువులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భిక్షులతో సుమారు 403 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి బుద్ధవనం చేరుకున్నారన్నారు. థాయిలాండ్ రాజకుటుంబం నుండి మహా థాయ్ ఈ దమ్మయాత్రకు సహకారం అందించారని తెలిపారు. గగన్ మాలిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గగన్ మాలిక్ దమ్మయాత్రకు ప్రారంభం నుండి ముందుండి నడిపించారన్నారు. అక్షయ ఫౌండేషన్ అధ్యక్షులు సిద్ధార్థ హిట్టెంబరి, లతరాజా ఫౌండేషన్ అధ్యక్షులు కేకే రాజా దమ్మ యాత్ర విజయవంతం చేసేందుకు భాగస్వాములు అయ్యారని తెలిపారు బిఎస్ఐ తెలంగాణ అధ్యక్షులు పరంధాములు ఆధ్వర్యంలో బిఎస్ ఐ సభ్యులు తెలంగాణలో కొనసాగిన దమ్మయాత్రకు సేవలు అందించారని అన్నారు. 29 రోజులు పాటు కొనసాగిన దమ్మయాత్రలో "సాతి" అనే శునకం బౌద్ధ భిక్షువులతో పాటు నడుస్తూ పాదయాత్రలో పాల్గొని ప్రత్యేకతను చాటుకుందన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధ వనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్రావు, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, స్థానిక సీఐ శ్రీను నాయక్, ఎస్సై ముత్తయ్య, స్థానిక కౌన్సిలర్లు, బౌద్ధాభిమానులు పాల్గొన్నారు.



## ప్రభుత్వాలు ప్రభుత్వ విద్య వ్యవస్థను అభివృద్ధి చేయాలి

**ఉత్తమ విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతమైన జీవితం.**

**బోడుప్పల్లో 367వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల.**

**మాదిగల వర్గీకరణలో అమరులకు నివాళులు.**

**అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య.**

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్ మార్చి 01 : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 367వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మాదిగ వర్గీకరణలో అమరులైన ఎమ్మార్పీఎస్ నాయకులకు అంబేద్కర్ ఆశయ సాధన సంఘం తరపున నివాళులర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధికంగా యువత గల దేశం మన భారతదేశం. కాబట్టి యువత మెరుగైన విద్యను అభ్యసించినప్పుడే ఆయా రంగాలలో విజయం సాధిస్తారు. నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసి, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం మెరుగైన వసతులు కల్పించినప్పుడు, దళిత బహుజన, గిరిజన, విద్యార్థులు ఉన్నతమైన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, విదేశాలలో విద్యావ్యవస్థ ఆదర్శంగా తీసుకుని భారత దేశంలో విద్యా వ్యవస్థను మెరుగుపరచాలని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, గరుగుల యాకయ్య, వై శ్రీనివాస్, జి వెంకటేష్ ,గరుగుల స్వర్ణ రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ



హుజూర్‌నగర్ మార్చి 01( వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న మీర్ తహర్ అలీ మస్జిద్ లో మహమ్మద్ అబ్దుల్ జబ్బర్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుజూర్‌నగర్ పట్టణం 19వ వార్డు కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కృష్ణ మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాసం, ఆత్మశుద్ధి, సేవాభావం మరియు పరస్పర ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రంజాన్ పర్వదినం మనుషుల మధ్య సోదరభావం, ఐక్యతను పెంచుతుందని తెలిపారు. హిందూ--ముస్లిం ఐక్యత భారతదేశ సంస్కృతికి ప్రతిబింబమని, అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన మహమ్మద్ అబ్దుల్ జబ్బర్ మరియు మసీదు కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు ఈ. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ముస్లిం సోదరులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## బౌద్ధ దమ్మయాత్రలో పాల్గొన్న బౌద్ధ ఉపాసకులు సీనియర్ న్యాయవాది తల్లమల్ల హసేన్

నాగార్జునసాగర్, మార్చ్ 1వాయిస్ టుడే: ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ సుమారు 403 కిలోమీటర్ల మేర కర్ణాటక గుల్బర్గా సిద్ధార్థ బుద్ధ విహార నుండి నాగార్జునసాగర్ బుద్ధవనానికి మార్చి ఒకటవ తేదీ సాయంత్రం చేరుకోనుంది. ఈ బౌద్ధ దమ్మ యాత్రలో బౌద్ధ ఉపాసకులు బుద్ధవనం ఓఎస్డి మల్లెపల్లి లక్ష్మయ్య బుద్ధిష్టి సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పరంధాములు సంఘమిత్ర ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు బౌద్ధ ఉపాసకులు సీనియర్ న్యాయవాది తల్లమల్ల హసేన్ బిఎస్ఐ నల్గొండ జిల్లా అధ్యక్షులు సంకు హరి జిల్లా ప్రధాన కార్యదర్శి నామ వెంకటేశ్వర్లు బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర నాయకులు కామర్ల జానయ్య తాళ్లపల్లి రవి గండమల్ల శ్రీను మంచాల నరసింహ డాక్టర్ రాజు నామాలింగయ్య ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు మాడుగుల శ్రీనివాస్ మన్నే బాబురావు తదితరులు పాల్గొన్నారు.




## మమత ఫిజియోథెరపీ క్లినిక్ ప్రారంభోత్సవం

**ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభోత్సవం చేసిన ఘట్కేసర్ మాజీ చైర్పర్సన్ ముల్లి పవని జంగయ్య యాదవ్**

ఘట్కేసర్, వాయిస్ టుడే న్యూస్, మార్చి 01 : జిహెచ్ఎంసి ఘట్కేసర్ సర్కిల్ లో నూతనంగా మమతా వినోద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మమతా ఫిజియోథిరాపీ క్లినిక్ ని ప్రారంభించిన ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్,ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మాట్లాడుతూ, ముందుగా మమతా వినోద్ కి శుభాకాంక్షలు తెలుపుతూ, ఘట్కేసర్ పట్టణ పరిసర ప్రజలకు ఫిజియోథెరపీ క్లినిక్ అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషం గా ఉందన్నారు. పట్టణ ప్రాంతం లో అతి తక్కువ గా ఉన్న ఫిజియోథెరపీ క్లినిక్ కొత్తగా ఏర్పాటు చేయడం వలన ప్రజలకు మరింత ఉపయోగకరంగా మీరు చేసినవారిగా ఉండిపోతారని ఎక్కడికో వెళ్లి చికిత్స చేపించుకోకుండా మన పట్టణం లో మన అనుకున్న వైద్యులతో చికిత్స మరింత సంతోషంన్ని ఇస్తుందని తెలుపుతూ, పేద మధ్య తరగతి ప్రజలకు అందు అందుబాటు ధరలో వైద్య ఖర్చులు ఉండేలా చూసుకోవాలని ప్రజల మన్ననలు పొంది మరిన్ని బ్రాంచులు ఏర్పాటు చేసి ప్రజలకు మంచి వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, నాయకులు లక్ష్మ రెడ్డి, భాస్కర్, ప్రవీణ్, విజయ్ పాల్గొన్నారు.

## మధుర బస్తీలో ఇఫ్తార్ విందు

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు**



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మార్చి 1 బీ కొత్తగూడెం పట్టణంలోని మధుర బస్తీలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రంజాన్ పండుగ సోదరభావం, సహనం, దానం వంటి గొప్ప విలువలను మనకు తెలియజేస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. షాబీర్ పాష, ఎర్ర లింగేష్, సినీ ప్రముఖులు.. మద్దెల శివకుమార్.. తదితర నాయకులు, స్థానిక ప్రముఖులు, యువకులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి, ఐక్యతా భావంతో సాగింది.



## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ

ఝరాసంగం ఫిబ్రవరి.01(వాయిస్ టుడే): కోహిర్ మండల గురుజ్వాడ గ్రామం లో శ్రీశ్రీశ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ గారి ఆవిష్కరణ జరిగింది గురుజువాడ గ్రామంలో కనుల పండుగలా కనివిని ఎరగని రీతిలో శ్రీశ్రీశ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ గారి విగ్రహ ఆవిష్కరణ జరిగింది ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, ఆదిత్యపరాశ్రీ స్వామి జి,ఎశ్రీఎ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్ కోహిర్ మండల అధ్యక్షుడు వైద్యనాథ్,బూత్ అధ్యక్షులు జి.చంద్రశేఖర్, కె.జి శివశంకర్,నాయకులు కిస్టన్న, మాజీ సొసైటి ఛైర్మెన్ శంకర్ రెడ్డి, నర్సింలు,నరేష్ జహీరాబాద్ టౌన్ అధ్యక్షులు పూల సంతోష్ కౌన్సర్ల్ అప్పం శ్రవణ్,బొగ్గుల సంతోష్, ప్రసాది మధుశేఖర్, నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు మహిళలు పిల్లలు పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా నేషనల్ సైన్స్ డే

**విద్యార్థుల అద్భుత ఆవిష్కరణలను అభినందించిన తుంగతుర్తి రవి**

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, మార్చి 01 : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవం (నేషనల్ సైన్స్ డే) వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి,5వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బోడిగె స్వాతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి మరియు అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన వివిధ వైజ్ఞానిక నమూనాలను తుంగతుర్తి రవి, ఆసక్తిగా పరిశీలించారు. విద్యార్థులు తమ ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న తీరును చూసి ఆయన ముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి రవి మాట్లాడుతూ?, నేటి పోటీ ప్రపంచంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు విద్యార్థులను కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం చేయకుండా, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో ముందంజలో ఉన్నాయి. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ, వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న తీరు అభినందనీయం. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించడంలో శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి ప్రోత్సాహం వల్లనే మన విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో రాణించగలరు. సర్ సి.వి. రామన్ స్ఫూర్తితో ప్రతి విద్యార్థి ఒక గొప్ప శాస్త్రవేత్తగా ఎదగాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నేను కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శంభోజు రమేష్ బాబు, ఛైర్పర్సన్ శంభోజు శ్రీలత, అకాడమిక్ ఇంచార్జి విశాల్, ఐతీ. రిషి అసిస్టెంట్ ప్రొఫెసర్, ఖ ఉదయ రాణి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తెలంగాణ, ప్రొఫెసర్ ఐతీ. ౧ విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది : భీమ్ భరత్

చేవెళ్ల... మార్చి 1(వాయిస్ టుడే)శంకర్ పల్లి మండల పరిధిలో దోబీపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఘనంగా ప్రారంభించిన చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని,పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టో లో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ, పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, సుశీల శంకర్, సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ అంతారం శ్రీనివాస్, వార్డ్ సభ్యులు,మాజీ ఎంపిటిసి అజాజ్ , కౌన్సిలర్ సమీ, సీనియర్ నాయకులు కృష్ణారెడస్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.